క్లుప్తంగా

దర్గాలో భక్తుల సందడి



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గాలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలను, ప్రార్థనలు జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న డీసీ వాణి

కౌతాళం: ఉరుకుందలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు గురువారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. మంత్రాలయం మండలం రాచమర్రి గ్రామ వాస్తవ్యులైన శ్రీకాంత్‌శెట్టి వారి కుటుంబ సభ్యులు రూ.1,01,116 నగదు రూపంలో అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డు, బాండు, ఫొటోను అందజేశారు.

21న దొడ్జెబాల్ పోటీలకు ఎంపిక

ఆదోని సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ జూనియర్స్ అండర్-19 విభాగంలో దొడ్జెబాల్ జట్టుకు ఈ నెల 21వ తేదీన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు దొడ్జెబాల్ అసోసియేషన్ కార్యదర్శి షాబీర్ గురువారం తెలిపారు. పోటీలకు గాను పట్టణంలోని పాఠశాల ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతాయన్నారు. వారు మాట్లాడు తూ ఎంపికైన క్రీడాకారులు గుజరాత్ రాష్ట్రంలో నవంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు అహ్మదాబాద్‌లో జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 70135 63203కు సంప్రదించాలన్నారు.

చిన్నారులకు స్వర్ణామృతప్రాసనం పంపిణీ



చిన్నారులకు మందు వేస్తున్న అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో అపురూ ప రోగ నిరోధక స్వర్ణామృత ప్రాసనం మందును గురువారం స్థానికఅభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో పంపిణీ చేశారు. మొత్తం 213 మంది చిన్నారులకు మందు అందజేసినట్లు అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా చెప్పారు.వెలకట్టలేని అమూల్యమైన ఈ మందు ద్వారా రోగనిరోధక శక్తి పెంచడానికి, మేధాశక్తిని, మానసిక, శారీరక ఎదుగుదలకు దోహద పడుతుందన్నారు.కార్యక్రమంలో ఆదోని పట్టణ అవోపా కార్యదర్శులు రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వ ర్లు, సభ్యులు వెంకటేష్‌బాబు, నవత వెంకటేశ్వర్లు, అవోపా మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతశ్రీ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

కౌతాళం: పోషక ఆహారంతోనే ఆరోగ్యం అని అంగన్ వాడీ కార్యకర్త లక్ష్మీనరసమ్మ అన్నారు. పోషకాహార వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రమైన కౌతాళంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు పోషకాల విలువలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలకు, బాలింతలకు, గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూడడానికి కిట్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు.

గోనెగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారంతో పాటు ఆకు కూరలు, కూర గాయలు తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ అన్నారు. మండల పరిధిలోని వీరంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కోసిగి: పౌష్టికాహారంతో కూడిన మంచి ఆహా రం ప్రతి రోజు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ రాజేశ్వరి సూచించారు. గురువారం మండలంలోని చిన్నభూంపల్లి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ భాగ్యలక్ష్మీ బాయి, కాత్యాయిని లతో కలిసి రాష్ట్రీయ పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎం పుష్పలత, ఎంఎస్‌కే గుణావతి, అంగన్ వాడీ కార్యకర్తలు రమాదేవి, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో భయం భయం

- పాఠశాలలో పాములు, తేళ్ల సంచారం
- విషపురుగు కాటుకు గురైన స్వీపర్
- ఒక రోజు ఆలస్యంగా వెలుగులోకి
- గతంలో ఎలుకలు, పాము కాటుకు గురైన విద్యార్థులు
- విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు సిబ్బంది ప్రయత్నం



గోనెగండ్ల ఏపీ మోడల్ స్కూల్

గోనెగండ్ల: మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో కొద్ది రోజులుగా పాములు, తేళ్ల సంచారం ఎక్కువైంది. ఈ విషయం తెలిసినా పాఠశాల సిబ్బంది తెలిసీతెలియనట్లు వ్యవహరిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బుధవారం పాఠశాల స్వీపర్ విష పురుగు కాటుకు గురైంది. ఈ విషయం ఒకరోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలోనూ విద్యార్థులు విషపురుగులు, ఎలుక కాటుకు గురైన ఘటనలు ఉన్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వీపర్‌కు విషపురుగు కాటు..

మోడల్ స్కూల్ సైన్స్ ల్యాబ్‌లో బుధవారం శుభ్రం చేసే క్రమంలో స్వీపర్ కృష్ణవేణి విష పురుగు కాటుకు గురైంది. దీంతో పాఠశాల సిబ్బంది గోనెగండ్లకు చెందిన పాములు పట్టే వ్యక్తిని పిలిపించి రూములో వెదకగా అక్కడ పాము తిరుగుతున్నట్లు గుర్తించారు. అక్కడ గోడలకు రంధ్రాలు ఉండటంతో పాము దొరకలేదు. తేళ్లు ఉండడంతో వాటిని చంపివేశారు. విష పురుగు కాటుకు గురైన స్వీపర్‌కు సిబ్బంది గుట్టు చప్పుడు కాకుండా గాజులదిన్నె గ్రామంలో నాటు వైద్యం చేయించి, అనంతరం కర్నూలు ఆస్పత్రిలో వైద్యం అందించారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు ఎలాంటి ప్రమాదం లేదని చెప్పినట్లు తెలిసింది. ఈ విషయం బయటకు తెలిస్తే తమకు ఇబ్బంది కలుగుతుందని విషయాన్ని ఎవరికి తెలియకుండా పాఠశాల సిబ్బంది దాచిపెట్టారు. స్వీపర్ విష పురుగు కాటుకు గురైన సంఘటన ఒక రోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ప్రాణాలు పోయే సంఘటనలు జరుగుతున్న బయటకు తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా దాచిపెట్టడం ఎంటాని విద్యార్థులకు ఏదైన ప్రమాదం జరిగే ఎవరు భాద్యత వహిస్తారని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

బయటకు చెప్పని సిబ్బంది

ఆదర్శ పాఠశాలలో దాదాపు 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆరు నెలల క్రితం ఓ విద్యార్థినికి ఇదే పాఠశాలలో పాము కరిచింది. ఈ విషయాన్ని కూడా దాచిపెట్టారు. అలాగే ఏడాది క్రితం ఇదే పాఠశాలకు చెందిన హాస్టల్‌లోని 20 మంది విద్యార్థునులను ఎలుకలు కరిచాయి. ఈ విషయాన్ని కూడా దాచిపెట్టాడంతో విషయం తెలుసుకున్న విద్యార్థునుల తల్లిదండ్రులు ఆందోళన చెపట్టారు. పాఠశాలలో జరిగే సంఘటనలను సిబ్బంది గోప్యంగా ఉంచడం ఎంటని విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

ఎవరికీ ఏమీ కాలేదు

బుధవారం జరిగిన సంఘటనపై పాఠశాల ప్రిన్సిపల్ షాహీనా పర్వీన్‌ను అడిగితే పాఠశాలలో ఎవరికీ ఏమీ కాలేదు. ఎలాంటి ప్రమాదం జరగలేదని, ఇదంతా ఫేక్ న్యూస్ అని కొట్టిపడేశారు.

డీఈఓ దృష్టికి తీసుకెళ్తా

బుధవారం మోడల్ స్కూల్‌లో జరిగిన సంఘటనను సిబ్బంది మా దృష్టికి తీసుకురాలేదు. ఆలస్యంగా వెలుగులోకి రావడంతో గురువారం సాయంత్రం విషయం తెలుసుకున్నాను. సిబ్బందిని విచారిస్తే స్వీపర్ విష పురుగు కాటుకు గురైందన్న విషయం తెలిసింది. ప్రస్తుతం స్వీపర్ కృష్ణవేణి ఆరోగ్యంగా ఉంది. గతంలో కూడా విద్యార్థులకు ఎలుకలు, ఒక విద్యార్థికి పాము కాటు వేసింది. బుధవారం జరిగిన విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్తాం.

– రామాంజినేయులు, ఎంఈఓ, గోనెగండ్ల

ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదు

పాఠశాల చుట్టూ ముళ్ల పొదలు నిండిపోయాయి. పాఠశాల ఆవరణలో విష పురుగులు పాములు, తేళ్లు తిరుగుతున్నాయి. గతంలో పాఠశాలలో విద్యార్థికి పాము కరిచింది. అప్పటి నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పినా ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదు. పాఠశాలలో అనేక సమస్యలున్నాయని చెప్పినా నిర్లక్ష్యం చేస్తున్నారు. బుధవారం సైన్స్ ల్యాబ్‌లో జరిగిన సంఘటన దాచడం దారుణం. స్వీపర్‌కు ఏదైన ప్రమాదం జరిగి ఉంటే దానికి బాధ్యత ఎవరు?. ఆమె స్థానంలో విద్యార్థులకు ఉండి ఉంటే పరిస్థితి ఏమిటి. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

– గౌస్, ఎస్ఎంసీ చైర్మన్

ఏపీఎం పై చర్యలు తీసుకోవాలి

కోసిగి: మండలంలో విలేజ్ ఆర్గనైజర్స్ అసిస్టెంట్ (వీఓఏ)లుగా పనిచేస్తున్న వారిని మానసికంగా వేధిస్తూ అవినీతికి పాల్పడుతున్న ఏపీఎం సత్యమ్మపై చర్యలు తీసుకోవాలని జన చైతన్య మండల అధ్యక్షురాలు రూథమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ డిమాండ్ చేశారు. గురువారం వెలుగు కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపి.. ఏపీఎం సత్యమ్మతో వాగ్వాదం చేశారు. వారు మాట్లాడుతూ కోసిగి మండలంలో 38 గ్రామ సంఘాలు ఉన్నాయని, గత రెండు రోజులుగా మండలంలో 15 మంది వీఓఏలను ఎటువంటి గ్రూప్ మీటింగ్ నిర్వహించకుండా, తిర్మానం లేకుండా తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. ఈవిషయాన్ని ఏపీఎంను అడుగుగా అడిగేందుకు మీరెవరు, నాఇష్టం నాకు అవసరమైన వారిని వీఓఏలుగా చేర్చుకుంటా.. అవసరం లేనివారిని తొలగిస్తానంటూ సమాధానం చెబుతోందని ఆరోపించారు. తొలగించిన వీఓఏలు మళ్లీ విధుల్లోకి రావాలంటే డబ్బులు ఇవ్వాలని, ఇచ్చిన డబ్బులను అధికార పార్టీ నాయకులకు, డీఆర్‌డీఏ పీడీకి ఇవ్వాలని చెబుతోందని తెలిపారు. మండలంలో వీఏఓల నుంచి దాదాపు రూ.25లక్షల వరకు వసూళ్లు చేసి అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు అజయ్, దేవన్న, రామన్న, రాజు, జయన్న తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై ఏపీఎం సత్యమ్మను వివరణ కోరగా మండలంలో పని చేయని వీఓఏలను గ్రామ సంఘం తీర్మానం చేసి తొలగించడం జరిగిందని, ఎవరు వద్ద ఒక్క రూపాయి తీసుకోలేదని ఆమె వివరించారు.

విద్యార్థిపై దాడి ఘటనపై విచారణ



విద్యార్థి తల్లితండ్రులను విచారిస్తున్న డీఈఓ శ్యామూల్

మంత్రాలయం : మంత్రాలయం మండల కేంద్రంలోని జీనియస్ గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం స్కూలు బస్సు డ్రైవర్ నరేష్ ఓ విద్యార్థి పట్ల కర్కశంగా ప్రవర్తించిన విషయం విధితమే. ఎల్‌కేజీ విద్యార్థి అయాన్ గోము చేశాడని చెంపపై బలంగా కొట్టి గాయపరిచిన విషయాన్ని సాక్షి బయట పెట్టింది. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ సిరి, జాయింట్ కలెక్టర్ నవ్య సీరియస్ అయ్యారు. మంత్రాలయం డిప్యూటీ తహసీల్దార్ గురురాజారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌రావును పాఠశాలకు పంపించి విచారణ చేయించారు. అంతేగాక డీఈవో శ్యామూల్ పాఠశాలకు చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు మహబూబ్‌బాషా, రియానతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమారుడికి గుండెజబ్బు ఉందని, తిరుపతిలో చికిత్స ఇప్పిస్తున్నట్లు డీఈవో దృష్టికి తెచ్చారు. డ్రైవర్ మా కుమారుడి పట్ల ఇలా ప్రవర్తించడం బాగా లేదని, పాఠశాల యాజమాన్యం కూడా పట్టించుకోలేదని వివరించారు.

డ్రైవర్‌పై కేసు నమోదు చేయండి

విద్యార్థి పట్ల దురుసుగా ప్రవర్తించి గాయపరిచిన డ్రైవర్ నరేష్‌పై కేసు నమోదు చేయాలని ఎంఈఓ మొయినుద్దీన్, రాఘన్నకు డీఈఓ ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌పై ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే పాఠశాల స్థితిగతులపై పూర్తి విచారణ చేయాలని చెప్పారు. అలాగే పాఠశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విచారణ నేపథ్యంలో పాఠశాల కరస్పాండెంట్ గంగాధర్ రెడ్డి రాకపోవడంపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థి సంఘాల ముట్టడి

విద్యార్థిపై దాడి ఘటనపై పలు విద్యార్థి సంఘాలు గురువారం స్కూలును ముట్టడికి దిగాయి. పాఠశాల కరస్పాండెంట్ గంగాధర్‌రెడ్డి స్టూడెంట్‌పై దాడి జరిగినా స్పందించకపోవడంపై విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహించి పాఠశాలలో ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఏఓ రఘుతో వాగ్వాదానికి దిగారు. విద్యార్థి పట్ల దురుసుగా ప్రవర్తించిన డ్రైవర్, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం డీఈఓ శామ్యూల్‌కు వినతిని అందజేశారు. ఆందోళనలో ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, ఆర్‌పీవైఎఫ్ సంఘాల నాయకులు థామస్, మహేంద్ర, రాజేష్, ఉదయ్, సురేంద్ర, ఏఐవైఎఫ్ నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ

ఆదోని రూరల్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి గురువారం ఆదోని పట్టణంలోని సబ్‌జైలును తనిఖీ చేశారు. జైలు ప్రాంగణాన్ని పరిశీలించి, ఖైదీల యోగక్షేమాలను, ఆహార సరఫరా, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ముద్దాయిలందరికీ ఉచిత న్యాయవాది కల్పించే వెసులుబాటు ఉందన్నారు. ఎవరికైనా ఆర్థికస్థోమత లేని వారు ఉంటే వారికి లీగల్ సర్వీసెస్ అథారిటీ తరపున ఉచిత న్యాయవాదిని నియమిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో 2వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.జె.సుధ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకటశేషాద్రి, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అర్చన, డాక్టర్ విష్ణు, జైలు సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్, లీగల్ ఎయిడ్ న్యాయవాది సి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌జైలులో ఖైదీల వివరాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

మెనూలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నందవరం: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని వంట ఏజెన్సీ సభ్యులకు ఎంఈఓ -2 రఘునాథ్ హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మండల విద్యాధికారి మధ్యాహ్న భోజనం, రికార్డులను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉరుకుందలో అభివృద్ధి పనుల పరిశీలన

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనులను గురువారం రాత్రి స్థపతి సుబ్రహ్మణ్యం, ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణిలతో కలిసి ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. రూ.5కోట్లతో నిర్మించే మాడ వీధులు, 2.30కోట్లతో నిర్మించే నూతన అన్నదానం షెడ్ స్థలాలను పరిశీలించారు. డీఈ శ్రీనివాసులు, ఏఈలు రవికుమార్, మనోజ్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

30లోగా ఈ–కేవైసీ చేయించుకోవాలి

కోసిగి: ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు ఉన్న కూలీలందురూ ఈనెల 30వ తేదీలోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఎంపీడీఓ ఈశ్వరయ్య , ఏపీఓ ఖాలిక్ సూచించారు. చేయించుకోనిపక్షంలో జాబ్ కార్డులు రద్దు అవుతాయని హెచ్చరించారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

ఎమ్మిగనూరు టౌన్ : పట్టణంలో మంచి నీటి పైపు లైన్ పనులు చేస్తున్నందున శుక్రవారం సోమప్ప నగర్, సాయి నగర్,శిల్ప, మిల్ట్రీ, ఎస్‌బీఎస్ కాలనీలు, తిలక్ నగర్, ఎల్లమ్మ బీడు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు.

సమయానికి బస్సు నడపండి

కౌతాళం: మండల పరిధిలోని హాల్వి గ్రామం నుంచి కౌతాళానికి విద్యార్థుల కోసం కళాశాల సమయంలో బస్సు నడపాలని హాల్వి విద్యార్థులు ఆదోని డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. కౌతాళంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రావాలంటే బస్సు చాల ఆలస్యం అవుతున్నదని, 8.30గంటలకు హాల్వి నుంచి బయలుదేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కళాశాల సమయానికి అనుకూలంగా ఉండేల బస్సు నడపాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ కూడా కోరారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో విఫలం

ఎమ్మిగనూరు టౌన్ : కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయ్యిందని సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు గోవింద్, రాముడు, నాగరాజు విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ ఆఫీస్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కె. ఇస్మాయిల్,సురేష్, రాజు, ఖాజా, కేసన్న పాల్గొన్నారు.

బోర్ల విద్యుత్ తీగల చోరీ

పెద్దకడబూరు : గ్రామానికి తాగునీరు అందించే బోర్లుకు సంబంధించిన విద్యుత్ తీగలు చోరీ జరిగిన ఘటన మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి తాగునీటిని సరఫరా చేసేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామానికి అర కిలోమీటర్ దూరంలో బోర్లు వేయించారు. వాటికి మోటార్లు అమర్చి, విద్యుత్ సప్లై ఇచ్చి రోజూ గ్రామానికి కావాల్సిన నీటిని అందిస్తున్నారు. అయితే బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ కేబుల్‌తో పాటు మోటార్‌కు ఉన్న స్టాటర్‌లు, విద్యుత్ వైర్లు కట్ చేసుకొని ఎత్తుకుపోయారు. ఇదిలా ఉండగా విద్యుత్ కేబుల్, స్టాటర్‌లు, విద్యుత్ వైర్లు దొంగలించుకుపోవడంతో సర్పంచ్‌పైనే భారం పడుతోంది. ఇలా జరగడం ఇప్పటికి నాలుగవసారి. బోర్లు గ్రామానికి దూరంగా ఉండడంతో రెండు, మూడు నెలలకు ఒసారి ఇలా జరుగుతోంది. కేబుల్ కొన్న ప్రతిసారి రూ.25వేలకు పైగా ఖర్చవుతోంది. కాగా, ఈ విషయాన్ని సంబంధిత పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని సర్పంచ్ మూలింటి లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.



బోరుకు ఉన్న విద్యుత్ కేబుల్ కట్ చేసిన దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అలీమ్ సిద్దిఖీ, ఉపాధ్యాయుడు నిరంజన్ కుమార్‌లను ఎస్టీయూ పట్టణశాఖ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఎస్టీయూ పట్టణశాఖ అధ్యక్షులు రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నెహ్రూమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్, గిరిబాబు, ఉరుకుందప్ప, సుధాకర్, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీర చంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

కౌతాళం: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి అన్నారు. గురువారం రాత్రి ఆమె కౌతాళం పోలీస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఐ అశోక్‌కుమార్‌తో కేసులపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ మందు తాగి వాహనాలు నడపొరదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడితే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకోల్పేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఫ్యాక్షన్ గ్రామాలైన రౌడూరు, నదిచాగి గ్రామాలను సందర్శించి ప్రజలకు పోలీసు వ్యవస్థ గురించి తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఆదోని టౌన్: ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కార్మికులు స్వచ్ఛతా పనులు చేపట్టారు. కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్ల సీజ్

పెద్దకడబూరు : అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సమాచారం మేరకు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామం సమీపంలో తనిఖీలు చేపట్టామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గరుసును తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం



నందవరం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘురామిరెడ్డి

నందవరం : మహిళల ఆరోగ్య పరిరక్షణే 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమ లక్ష్యమని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీలేఖ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యం కోసం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంపై అవగాహన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..మహిళల ఆరోగ్యం కుటుంబానికి బలమన్నారు. ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి మహిళలకు వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తగిన వైద్యసేవలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'చలో మెడికల్ కాలేజీ'ని జయప్రదం చేయండి

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు చేపట్టే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. దీంతో అన్నివర్గాల ప్రజలు, విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో కౌన్సిలర్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు దేవా, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఎమ్మిగనూరులో ఉల్లి కొనుగోళ్లు

ఎమ్మిగనూరుటౌన్: ఉల్లి రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ఉల్లికొనుగోలు కేంద్రాన్ని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఇందులో భాగంగా విక్రయానికి రైతులు తెచ్చిన ఉల్లిని ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉల్లిపంట సాగు చేసి తాము తీవ్రంగా నష్టపోయాయమని, మద్దతు ధరలేక పొలాల్లోనే వదిలేశామని కొందరు రైతులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ఈక్రాప్ చేయించుకున్నారా అని రైతులను జేసీ ప్రశ్నించగా.. తనకు ఐదెకరాల భూమి ఉండగా.. ఆన్‌లైన్‌లో అది ప్రభుత్వ భూమిగా నమోదు కావండలో ఈ -క్రాప్ చేయలేదని, కేవలం ఎకరా మాత్రమే చేశారని దేవనకొండకు చెందిన రైతు ఖాజాబంద తెలిపాడు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని రైతు జేసీ ముందు వాపోయాడు.

మొదటి రోజు వంద క్వింటాళ్లు..

మొదటి రోజు వివిధ ప్రాంతాల నుంచి 18 మంది రైతులు దాదాపు వంద క్వింటాళ్ల ఉల్లిని విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకొచ్చారు. జేసీ విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్‌లో రెండు రోజుల పాటు ఉల్లి క్రయవిక్రయాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కర్నూలు మార్కెట్‌కు రెండు రోజులు సెలవు ఇవ్వడం వల్ల రైతులు ఇబ్బంది పడకుండా ఇక్కడ క్రయవిక్రయాలు ప్రారంభించామన్నారు. ఇక్కడ ఉల్లిని కొనుగోలు చేసేందుకు 8మంది ట్రేడర్లు ముందుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజినేయులు, ఏడీఎం నారాయణమూర్తి, డీడీ దివాకర్, మార్క్‌ఫెడ్ ఎండీ రాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉల్లికొనుగోలు కేంద్రంలో విక్రయానికి తెచ్చిన ఉల్లిని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జేసీ బి. నవ్య

అర్బన్ హెల్త్ సెంటర్లో అగ్ని ప్రమాదం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సంజీవయ్య నగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. సెంటర్లో సిబ్బంది విధుల్లో ఉండగా లోపల గది నుంచి పొగలు రావటంతో అందరు బయటకు పరుగులు తీశారు. కాలనీ వాసులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తూ.. అగ్నిమాపక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు అర్బన్ హెల్త్ సెంటర్లోని ఫర్నీచర్, మెడిసిన్, వస్తువులు కాలిపోయాయి. మంటలను అదుచేయటానికి అగ్నిమాపక సిబ్బందికి చాల సేపు శ్రమించాల్సి వచ్చింది. ప్రమాదంలో సెంటర్లోని మెడిసిన్, ఫర్నీచర్, ఇతర వస్తువులు కాలిపోయాయని దాదాపు రూ. 5 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు డాక్టర్ శాదర తెలిపారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు.



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక పోలీసులు

గ్రేడింగ్ చేసిన ఉల్లినే మార్కెట్‌కు తీసుకెళ్లాలి

గోనెగండ్ల : గ్రేడింగ్ చేసిన ఉల్లినే మార్కెట్‌కు తీసుకెళ్లాలని కర్నూలు ఉద్యాన సహాయ సంచాలకులు కృష్ణ వర్ధన్ రెడ్డి, ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. గురువారం మండలంలో పిల్లిగుండ్ల, నెరుడుప్పల గ్రామాల్లో ఉల్లి పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ఉల్లి పంట 120 రోజులు దాటిన తర్వాతనే కోత కోసి, గ్రేడింగ్ చేసి ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుకు తీసుకెళ్లాలన్నారు. మార్కెట్‌లో ఉల్లికి మద్దతు ధర రూ.1200 పలుకుతుందని చెప్పారు. చిన్న చిన్న గడ్డలను పెద్ద గడ్డలతో కలపకుండా వేరుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ హేమలత, తహసీల్దార్ రాజేశ్వరి, గ్రామ వ్యవసాయ అధికారులు నరసప్ప, పులిరాజు, అరుణ, రైతులు పాల్గొన్నారు.